

# కితకితలు

1. ఓ భారతీయుడు, మరో విదేశీయుడు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు.

"మీ భారత్‌లో భార్యలు భర్తల వెనుక నడుస్తారటగా" మా దేశంలో అయితే ఎంచక్కా చేయీ చేయి పట్టుకుని నడుస్తారు తెల్సా" విదేశీయుడు వ్యంగ్యంగా అన్నాడు.

"నిజమే. పాపం మీ దేశంలో అలా చేయి పట్టుకోకపోతే వేరే ఎవరితోనైనా పారిపోతారని భయం కదా" జాలిగా చూస్తూ బదులిచ్చాడు భారతీయుడు.

❀❀❀

2. "ఏయ్ రమా, మీ ఆయన చెప్పిందే చెప్తూ చేసిన పనే చేస్తూ నిన్ను విసిగిస్తుంటాడని విన్నాను నిజమేనా?" అడిగింది ప్రభ

"అవును కాని ఏం చేస్తాం ఆయన మా పెళ్ళికి ముందు చేసిన పని అలాంటిది" నీరసంగా బదులిచ్చింది రమ.

"అలాగా.. ఇంతకీ ఏంచేసేవారేంటి?"

"టీ.వి. సీరియల్స్‌కి డైరెక్షన్"

❀❀❀

3. ఎపుడూ డబ్బు, వ్యాపారం అంటూ కలవరించే భర్తను, మంచి రొమాంటిక్ మూడ్‌లోకి తీసుకురావాలని నిర్ణయించిందో భార్య. దానికోసం ఓ చక్కని వెన్నెలరాత్రి అన్నీ సిద్ధంచేసి పడక గదిలో భర్తని కబుర్లలోకి దించింది.

"ఏవండీ మీకు మన మొదటి రాత్రి గుర్తుందా" గోముగా ప్రశ్నించడం మొదలు పెట్టింది భార్య.

"ఆ" తదేకదీక్షతో డబ్బులు లెక్కపెట్టుకుంటూనే బదులిస్తున్నాడు భర్త.

" నేను తెల్లచీరతో గదిలోకొచ్చాను..."

"ఆ వచ్చే ఉంటావులే..."

"పాలు సగం తాగి మీకు సగం ఇచ్చాను"

"ఇచ్చే ఉంటావులే"

"స్వీటు సగం కొరికి మీ నోటికి..."

"ఆ గుర్తొచ్చిందేవ్" గట్టిగా అరిచాడు భర్త"

"హమ్మయ్య... గుర్తొచ్చిందన్నమాట" ఆనందంగా అంది భార్య

"ఆ రోజు మిఠాయి కొట్టువాడికి వందిచ్చి చిల్లర మర్చిపోయా" తలుపుతీసుకుని స్వీట్‌షాప్‌వైపు పరుగెత్తాడు భర్త.

❀❀❀

4. "మీ రచనలకు, కథలకు స్ఫూర్తి ఎవరు? సన్మానం అందుకుంటున్న రచయిత్రిని ప్రశ్నించాడో విలేకరి.

"ఇంకెవరు మా ఆయనే" చెప్పింది రచయిత్రి

"అదేంటి మీ ఆయనతో సరిపడక విడిపోయానన్నారుగా"

"నిజమే. కాని మరి కల్సి ఉన్నప్పుడు ఆయన రోజూ ఇంటికి ఆలస్యంగా వచ్చేవారు. అలా వచ్చినప్పుడల్లా ఒక్కో కథ చెప్పేవారు. అలా నేను స్ఫూర్తి పొందానన్నమాట" విడమరిచిచెప్పింది రచయిత్రి.

❀❀❀

5. ఏమిటండీ టపాసులు తెమ్మంటే టేప్‌రికార్డర్‌లోకి క్యాసెట్టు తెచ్చారు..?

భర్తని ఆశ్చర్యంగా ప్రశ్నించింది భార్య.

"దీనిలో అన్నిరకాల టపాసుల శబ్దాలూ రికార్డ్ చేసి ఉన్నాయే. ఎంచక్కా ఇంట్లో ఇది ఆన్ చేసి పెడితే చాలు, బోలెడన్ని డబ్బులు ఆదా" తాపీగా చెప్పాడు భర్త.

❀❀❀

6. "దీపావళి టపాసులకీ నా జీవితానికీ ఏదో దగ్గర సంబంధం ఉన్నట్టనిపిస్తుంది" ఆకాశంలోకి చూస్తూ అన్నాడు భర్త.

"ఏంటో అది చెప్పి చావండి" చిరాగ్గా అడిగింది భార్య"

"నేను చిన్నపుడు తారాజువ్వలా అన్పించేవాడినట... మా బంధువులు అంటుంటారు"

"ఆహా ఆ తర్వాత"

"యవ్వనంలో చిచ్చుబుడ్డిని తలపించేవాడినట"

"బావుంది.. ఆ తర్వాత"

"ఆ తర్వాత చెప్పడానికేముందీ పెళ్ళయిందికదా... భూచక్రంలా నీ చుట్టూ తిరుగుతున్నాను"

❀❀❀

7. బంధువులింటికని వెళ్తూ ఓ చాక్లెట్ కొనుక్కుని పట్టుకెళ్ళాడు సుబ్బారావు తీరా చూస్తే ఆ ఇంట్లో ఉన్న నలుగురు పిల్లలూ నాక్కావాలంటే నాకు అంటూ చాక్లెట్ కోసం దెబ్బలాడుకోడం మొదలుపెట్టారు. దాంతో "ఎవరైతే మామయ్య మాట బుద్ధిగా, ఎదురుచెప్పకుండా వింటారో వారికే ఈ చాక్లెట్" అని సుబ్బారావు మెలిక పెట్టాడు.

అంతే పిల్లలంతా చాక్లెట్ తీసుకెళ్ళి వాళ్ళనాన్న చేతిలో పెట్టేసి ఆడుకోవడానికెళ్ళిపోయారు.

❀❀❀

8. "హమ్మయ్య నాకింక ఏ బెంగాలేదండి" ఆసుపత్రి బెడ్ మీద ఉన్న భర్తతో అంది భార్య.

"ఏమే నా జబ్బు నయమైపోతుందని డాక్టరు చెప్పాడా?" ఆతృతగా అడిగాడు భర్త.

"అబ్బే కాదండి. మీ ఎల్.ఐ.సి పాలసీ ఫోర్సులోనే ఉందని ఏజెంట్ చెప్పాడు" ఆనందంగా అంది భార్య

-యస్బీ

### వ్యవహార దక్షత

తెలివైన వాణిజ్యవేత్త అయిన జాక్ తన కుమారునితో ఇలా సంభాషణ సాగిస్తున్నాడు.

జాక్ నేను ఎంపిక చేసే యువతిని నువ్వు వివాహం చేసుకోవాలన్నది నా అభిమతం.

కుమారుడు నా వధువును నేను ఎంచుకుంటాను!

జాక్ కాని ఆ యువతి బిల్ గేట్స్ కుమార్తె.

కుమారుడు అలా అయితే సరే....

ఆతరువాత జాక్ బిల్ గేట్స్ వద్దకు వెళ్ళాడు.

జాక్ మీ కుమార్తెకు ఒక వరుని చూశాను.

బిల్ గేట్స్ కాని నా కుమార్తె ఇంకా పెళ్ళి వయస్సు రానంత చిన్నది. జాక్ కాని ఈ యువకుడు ప్రపంచ బ్యాంకు వైస్-ప్రెసిడెంట్.. బిల్ గేట్స్ ఆహా! అలా అయితే సరే...

చివరగా జాక్ ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంట్ వద్దకు వెళ్ళాడు.

జాక్ వెస్-ప్రెసిడెంట్‌గా నియమించదగిన ఒక యువకుడు నా వద్ద ఉన్నాడు.

ప్రెసిడెంట్ నాకు అవసరమైనవారి కన్నా కూడా ఎక్కువ మందే వైస్-ప్రెసిడెంట్స్ నా వద్ద ఉన్నారు.

జాక్ అయితే ఈ యువకుడు బిల్ గేట్స్ అల్లుడు.

ప్రెసిడెంట్ అలా అయితే... ఓకె.

అలా జాక్ తన లక్ష్యం సాధించాడు.